క్లుప్తంగా

ప్రశాంతంగా ముగిసిన గురుకుల అర్హత ప్రవేశ పరీక్ష



వేలేరు : మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో 2025–2026 విద్యా సంవత్సరానికి గాను ఆదివారం నిర్వహించిన టీజీసెట్ 5వ తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 100 మంది విద్యార్థులకు గాను 99 మంది పరీక్ష రాసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రౌతు అజయ్‌కుమార్ తెలిపారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



దామెర : మండలంలోని ఊరుగొండ గ్రామంలో గల శ్రీభవాని రామలింగేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి, బీజేపీ నాయకులు డాక్టర్ కాళీప్రసాద్‌రావు, డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డికి ఆలయ కమిటీ, ఆలయ అర్చకులు వేర్వేరుగా కలిసి ఆహ్వానపత్రాలు అందించారు.

మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలి



ఖిలా వరంగల్: విద్యార్థులు మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్ సూచించారు. కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం మాధవి అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు నిజజీవితంలో సమస్యలను ఎలా అధిగమించాలి, లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని ఎలా సాధించుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుంభమేళాకు వెళ్లిన వినయ్‌భాస్కర్ దంపతులు




హన్మకొండ: మహా కుంభమేళాకు బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ దంపతులు తరలివెళ్లారు. ఈమేరకు ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్ వద్ద గంగ, యమున, సరస్వతి నదుల త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానమాచరించి, ప్రత్యేక పూజలు చేశారు.

6కిలోల మిశ్రమ వెండి ప్రతిమ బహూకరణ

మడికొండ: 6కిలోల 250 గ్రాముల మిశ్రమ వెండితో తయారు చేసిన స్వామివారి విగ్రహాన్ని మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయానికి భక్తులు ఆదివారం బహూకరించారు. ఈ సందర్భంగా ఆ విగ్రహానికి అర్చకులు ప్రత్యేక అభిషేకం చేసి అలంకరణ చేశారు. కార్యక్రమంలో దాతలు అడ్డగూడూరి సత్యనారాయణ దంపతులు, శశిధర్ దంపతులు, శ్రీనివాస్ దంపతులు, సుధాకర్ దంపతులు, ప్రవీణ్‌రెడ్డి దంపతులు, సతీష్‌కుమార్ దంపతులు, నాగరాజు దంపతులు, సుధీర్‌రెడ్డి దంపతులు, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, కార్యనిర్వహణాధికారి శేషభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్, ధర్మకర్తలు బైరి రాజుగౌడ్, దండిగం శ్రీనివాస్, రొడ్డ దయాకర్, బోగి కేదారి, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, వస్కుల ఉమ పాల్గొన్నారు.

‘అరూరి’ని పరామర్శించిన కేంద్రమంత్రి



హసన్‌పర్తి: మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత అరూరి రమేష్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆదివారం పరామర్శించారు. ఇటీవల అరూరి రమేష్ తల్లి వెంకటమ్మ మృతి చెందారు. ఈమేరకు ప్రశాంత్ నగర్‌లోని అరూరి రమేష్ ఇంటికి మంత్రి సంజయ్ వెళ్లి ఓదార్చారు. మంత్రి వెంట పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, పార్టీ హనుమకొండ మాజీ అధ్యక్షురాలు రావు పద్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జక్కు రమేష్ తదితరులు ఉన్నారు.

ప్రయాణం నరకప్రాయం



రోడ్డుపై ఏర్పడిన గుంతలు



ప్రమాదకరంగా ఉన్న రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహనదారులు

- గుంతల రోడ్డుతో గుబులు
- చినుకు పడితే దారంతా చిత్తడే
- బస్సు సౌకర్యానికి లభించని మోక్షం

ధర్మసాగర్ : మండలంలోని రాపాకపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలతో గుబులు పుట్టిస్తోంది. రాపాకపల్లి గ్రామం గతంలో ధర్మసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉండేది. 6 సంవత్సరాల క్రితం నూతన జిల్లాలు, మండలాలు, గ్రామ పంచాయతీల ఏర్పాటులో భాగంగా రాపాకపల్లి నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు అయ్యింది. ఈ గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో బస్సు సౌకర్యానికి మోక్షం లభించడం లేదు. ఇటీవల ధర్మసాగర్ నుంచి వయా వడ్డెగూడెం, రాపాకపల్లి మీదుగా దేవునూర్ గ్రామం వరకు 7 కిలో మీటర్లు బీటీ రోడ్డు వేసేందుకు నిధులు మంజూరు కాగా సంబంధిత కాంట్రాక్టర్ ధర్మసాగర్ శివారు నుంచి రాపాకపల్లి వరకు రోడ్డు వేయకుండానే చేతులెత్తేశాడు. అయితే ధర్మసాగర్ మండల కేంద్రంలో వివిధ పనులు నిమిత్తం రాపాకపల్లి ప్రజలు ఉనికిచర్ల మీదుగా రవాణా కొనసాగిస్తుండేవారు. ప్రస్తుతం ఆ రోడ్డు కూడా పూర్తిగా గుంతలు ఏర్పడి ప్రయాణించలేని దుస్థితికి చేరుకుంది. ఆ రోడ్డుకిరువైపులా ఉనికిచర్ల, రాపాకపల్లి గ్రామస్తులకు చెందిన వ్యవసాయ భూములు కూడా ఉంటాయి. ఆ గ్రామానికి కనీసం ఆటో సౌకర్యం కూడా లేకపోవడంతో ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో హనుమకొండ నగరానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదే విధంగా ధర్మసాగర్ నుంచి వడ్డెగూడెం, రాపాకపల్లి గ్రామానికి కేవలం నాలుగు కిలోమీటర్లు మాత్రమే ఉండగా ఆ రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో ఉనికిచర్ల గ్రామం మీదుగా 8 కిలో మీటర్ల దూరం నుంచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పందించి ఉనికిచర్ల నుంచి రాపాకపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు మరమ్మతులు చేయించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



ఉనికిచర్ల నుంచి రాపాకపల్లి మీదుగా దేవునూర్‌కు వెళ్లే రోడ్డుపై పూర్తిగా గుంతలు ఏర్పడడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వర్షకాలం వస్తే దారంతా బురదమయంగా మారుతుంది. దేవునూర్, సోమదేవరపల్లి గ్రామస్తులు కూడా ఈ రోడ్డు గుండానే హనుమకొండ, కాజీపేట నగరాలకు వెళ్తుంటారు. అత్యవసర పరిస్థితుల్లో నగరానికి వెళ్లేందుకు ఆటోలు కూడా రావడం లేదు. రవాణా కష్టాలు తొలిగించాలని పలుమార్లు అధికారులను కోరినా ఫలితం లేదు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపించి బస్సు సౌకర్యం కల్పించాలి.

– కందుకూరి సుధాకర్, రాపాకపల్లి

దైవానుగ్రహం గొప్పది : ఎమ్మెల్యే రేవూరి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు : దైవానుగ్రహం ఉంటే ప్రతిఒక్కరూ అన్ని రంగాల్లో రాణిస్తారని, దైవానుగ్రహం గొప్పదని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. ఆత్మకూరు మండల కేంద్రంలో బీరప్ప ఆలయంలో నూతన విగ్రహాల ప్రతిష్ఠాపన వేడుకల్లో వారు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతిఒక్కరిపై కులదైవాల అనుగ్రహం ఉండాలని, నియోజకవర్గ ప్రజలపై బీరప్ప ఆశీస్సులు ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పింఛన్ కోసం నాలుగేళ్లుగా నడక..



నడికూడ : వృద్ధాప్య పింఛన్ కోసం నాలుగేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతూ అలసిపోయానని మండల కేంద్రానికి చెందిన 70 ఏళ్ల ఒంటేరు బుచమ్మ వాపోయింది. ఆదివారం ఆమె తన గోడును సాక్షికి వెలబుచ్చింది. నాలుగేళ్ల క్రితం భర్త కూడా చనిపోయిందని తెలిపింది. తనకు వృద్ధాప్య లేదా వితంతువు పింఛన్ మంజూరు చేయాలని పలుమార్లు అధికారులను వేడుకున్నా పట్టించుకోవడం లేదని వాపోయింది.

ఎంజేపీ సిబ్బంది నిర్వాకం



పాఠశాల ప్రహరీ పక్కకు పోసిన చెత్త

శాయంపేట : మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల, కళాశాల ప్రహరీ పక్కనే గురుకుల పాఠశాలలోని సిబ్బంది చెత్తను కుప్పలుగా పోసి తగలబెడుతున్నారు. పక్కనే ఉన్న క్లాస్ రూంలోకి పొగ వ్యాపించడంతో గురుకుల పాఠశాల విద్యార్థులు శ్వాసకోశకు గురయ్యే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. ప్రిన్సిపాల్ చొరువ తీసుకుని చెత్తను పాఠశాల ప్రహరీ పక్కన పోసి తగలబెట్టకుండా తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

గుండెపోటుతో యువరైతు మృతి



విజేందర్ (ఫైల్)

ఆత్మకూరు : గుండెపోటుతో యువరైతు మృతిచెందాడు. ఈ సంఘటన అక్కంపేటలో ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కంపేటకు చెందిన కడుదుల విజేందర్ (33) ఛాతిలో నొప్పి వస్తుందని కుటుంబ సభ్యులకు చెప్పాడు. వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



శాయంపేట : మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన పెంబర్తి సంపత్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సంపత్‌తో 2005–2006లో పదో తరగతి చదువుకున్న స్నేహితులు ఆదివారం సంపత్ కుటుంబాన్ని పరామర్శించి రూ. 16వేల ఆర్థికసాయం అందజేసి చేయూతనిచ్చారు. అందించిన వారిలో నాని, విజయ్, సూర్యప్రకాశ్, చంద్రశేఖర్, భిక్షపతి, సందీప్, నగేష్, సుమన్, బాలకృష్ణ, సతీశ్ ఉన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం అందజేత



వేలేరు : మండలంలోని గుండ్లసాగర్ గ్రామానికి చెందిన టేకుల సమ్మయ్య గ్రామంలో ఉపాధి లేక హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. సమ్మయ్యకు చెందిన పూరిగుడిసెలో ఆయన తండ్రి వెంకటయ్య ఉంటున్నాడు. అయితే నాలుగు రోజుల క్రితం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ఎస్సై అజీర్మ సురేశ్ బాధితుడి కుటుంబాన్ని పరామర్శించి షార్ట్ సర్క్యూట్ జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.2వేల నగదు, సరుకులు అందజేశారు.

జీబీఎస్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

వరంగల్: సేవాలాల్ 286వ జయంతి వేడుకలను పురస్కరించుకొని గోరు బంజారా సేవాలాల్ సంక్షేమ సంఘం (జీబీఎస్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో వరంగల్ ఓసిటీ నుంచి హనుమకొండలోని దీన్‌దయాళ్ నగర్ సేవాలాల్ మహారాజ్ దేవాలయం వరకు ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని గోర్ బంజారా సేవాలాల్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, గోర్ సిక్వాడీ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ కున్సోత్ హత్యానాయక్ జెండా ఊపి ప్రారంభించారు. బైక్ ర్యాలీలో గోర్ సేన, గోర్ మలావ్ వెల్ఫేర్ సొసైటీ, ఎల్‌హెచ్‌పీఎస్, సేవాలాల్ సేనతో పాటు పలు బంజారా సంఘాలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్, మాజీ ఎంపీ సీతారాంనాయక్, ఆర్టీఓ రమేష్ రాథోడ్, గోర్ సేన హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తేజావత్ ఫణికుమార్, సంగెం మాజీ జెడ్పీటీసీ వీరమ్మ, గోర్ బంజారా సేవాలాల్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నునావత్ రవీందర్, కోశాధికారి గుగులోత్ తిరుపతి, సహాయ కార్యదర్శి వినేష్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులను ఒకే కులంగా గుర్తించాలి

హసన్‌పర్తి: విశ్వబ్రాహ్మణులను ఐదు కులాలుగా కాకుండా ఒకే కులంగా గుర్తించాలని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోజు భిక్షపతి కోరారు. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం హనుమకొండ, వరంగల్ జిల్లాల సమావేశం భీమారంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు విశ్వబ్రాహ్మణుల బతుకులు చితికిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. విశ్వ బ్రాహ్మణుల ఐదు కుల వృత్తులు పూర్తిగా అంతరించిపోయాయని వాపోయారు. విశ్వబ్రాహ్మణులకు ప్రత్యేక సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక కార్పొరేషన్ ద్వారా రూ.రెండువేల కోట్లు కేటాయించాలని కోరారు. మార్చిలో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు భిక్షపతి వివరించారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు వెంకటేశ్వర్లు, రమేష్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మణీంధర్‌నాథ్ పాల్గొన్నారు.

బర్డ్ ఫ్లూపై వదంతులను నమ్మొద్దు

- బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ

మడికొండ: బర్డ్ ఫ్లూపై వస్తున్న వదంతులను ప్రజలు నమ్మొద్దని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బీజేపీ హనుమకొండ జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. పీపీసీఏ పౌల్ట్రీ ఆధ్వర్యంలో వెన్‌కబ్ కంపెనీ సహకారంతో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్ పటేల్ ఆధ్వర్యంలో మడికొండ చౌరస్తాలో చికెన్, ఎగ్ మేళాను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చికెన్ కూర, కోడి గుడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రావు పద్మ మాట్లాడుతూ చికెన్ తింటే ఏమీ కాదని అన్నారు. ప్రజల్లో ఉన్నభయాన్ని పోగొట్టడానికే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు వెన్‌కబ్ సంస్థ అధికారులు తెలిపారు. బ్రాంచ్ మేనేజర్ వెంకటేశం, మార్కెటింగ్ మేనేజర్ రాజు, బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి, కంపెనీ సిబ్బంది రమేష్, రామచంద్రం, వరంగల్ జిల్లా ఫార్మర్స్ ట్రేడర్స్, తదితరులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ నూతన కార్యవర్గం ఎన్నికలు హనుమకొండలోని రెవెన్యూ గెస్ట్‌హౌస్‌లో ఆదివారం జరిగాయి. తొమ్మిది క్లబ్‌లకు చెందిన 18 మంది ఓటర్లు పాల్గొన్న ఈ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు ఎన్నికల అధికారి అడ్వకేట్ ఎం.రాజేందర్ ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా యాదగిరి, సంయుక్త కార్యదర్శిగా అనిత, కోశాధికారిగా లక్ష్మణ్, కార్యనిర్వాహక సభ్యులుగా దయాకర్, అనిల్, రూప ఎన్నికైనట్లు వివరించారు. ఎన్నికల ప్రక్రియకు ముందు సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. బాల్ బ్యాడ్మింటన్ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవీందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీవైఎస్‌ఓ అశోక్‌కుమార్, ఒలింపిక్స్ సంఘం జిల్లా చైర్మన్ అజీజ్‌ఖాన్, ఉమ్మడి వరంగల్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి వీరన్న, క్రీడాకారులు పాల్గొన్నారు.

బీజేపీకి బీఆర్‌ఎస్ పరోక్ష మద్దతు

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు

న్యూశాయంపేట: రాష్ట్రంలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పోటీ చేయకుండా మతోన్మాదులకు సహకరిస్తోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు బీఆర్‌ఎస్ పరోక్షంగా సహకరిస్తూ వారి గెలుపునకు కృషి చేస్తోందని ఆరోపించారు. హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లా సమితి సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి కమ్యూనిస్టులు సహకరిస్తున్నారని, కమ్యూనిస్టులపై బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అక్కసు వెళ్లగక్కుతున్నారని అన్నారు. నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే కమ్యూనిస్టుల గురించి మాట్లాడే నైతిక అర్హత కేసీఆర్‌కు లేదన్నారు. సమావేశానికి జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, నాయకులు మంచాల రమాదేవి, కర్రె లక్ష్మణ్, ఉట్కూరి రాములు, మునిగాల భిక్షపతి, బాషబోయిన సంతోష్ పాల్గొన్నారు.

ఓటీపీ వద్దు.. వేలి ముద్రే ముద్దు



సీసీఐ కేంద్రం వద్ద పత్తి రైతులు



కొనుగోలు కేంద్రంలోని పత్తి నిల్వలు

పత్తి కొనుగోళ్లలో సాంకేతిక లోపం..

- రైతులకు ఐరిస్‌తో గుర్తింపు
- దళారులకు చెక్ పెట్టిన సీసీఐ, మార్కెటింగ్‌శాఖ
- కౌలు రైతులకు ఇబ్బందులంటున్న వ్యాపారులు
- నేడు రాష్ట్ర కార్యాలయంలో టీఆర్‌ల అప్పగింత

వరంగల్: సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల్లో జారీ చేసిన టీఆర్(టెంపరరీ రిజిస్ట్రేషన్స్)లలో అవకతవకలు జరిగినట్లు గుర్తించిన రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ ప్రస్తుతం అమలవుతున్న ఓటీపీ పద్ధతికి స్వస్తి పలికి వేలి ముద్రల(బయోమెట్రిక్) సేకరణ ప్రక్రియను అమలు చేస్తోంది. ఈనెల మొదటి వారంలో సాంకేతికపరమైన లోపాల కారణంగా సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లు నిలిచిపోయాయి. ఈక్రమంలోనే టీఆర్‌ల విషయం వెలుగు చూడడంతో బయోమెట్రిక్ పద్ధతిని అమలు చేస్తూ ఈనెల 21 నుంచి పత్తి కొనుగోలు చేస్తున్నారు. వేలి ముద్ర గుర్తింపు కాని సమయంలో ఐరిస్ గుర్తింపు తీసుకుంటున్నారు. దీంతో రైతులు పత్తి విక్రయించేందుకు సీసీఐ కేంద్రాలకు రావాల్సి వస్తోంది.

దళారులకు చెక్.. కౌలు రైతులకు ఇబ్బందులు

బయోమెట్రిక్ విధానంతో దళారులకు చెక్ పెట్టినట్లు అధికారులు భావిస్తున్నప్పటికీ రైతుల వద్ద భూములు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేసిన రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసింది. గతంలో కౌలు రైతులు పత్తి విక్రయించేందుకు వ్యవసాయ శాఖ ధ్రువీకరించిన టీఆర్ తీసుకువస్తే మార్కెటింగ్ శాఖలో రిజిస్టరైన రైతుకు ఓటీపీ వెళ్లేది. సదరు రైతు ఓటీపీని ఒకే చేస్తే సీసీఐ ఆరైతు తెచ్చిన పత్తి కొనుగోలు చేసేది. ప్రస్తుతం టీఆర్‌లను పరిగణలోకి తీసుకోక పోవడంతో సీసీఐ విక్రయ కేంద్రానికి తప్పనిసరిగా రైతులు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నేడు టీఆర్‌ల అప్పగింత..!

రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో జారీ చేసిన 46వేల టీఆర్(టెంపరరి రిజిస్ట్రేషన్)లను సోమవారం(నేడు) రాష్ట్ర మార్కెటింగ్ కార్యాలయంలో అప్పగిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. టీఆర్‌లలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో ఏడుగురు మార్కెట్ కార్యదర్శులను సస్పెండ్ చేశారు. వేలల్లో టీఆర్‌లను జారీ చేసిన వారిని మినహాయించి కొందరిపైనే వేటు వేయడం చర్చనీయాంశంగా మారింది. ఈవ్యవహారంలో సంబంధం ఉన్న డీఓ(డాటా ఎంట్రీ ఆపరేటర్)లపై వేటు పడే అవకాశాలున్నట్లు సమాచారం. ఈనేపథ్యంలో వరంగల్ మార్కెట్ కమిటీ పరిధిలో ఇద్దరు ముగ్గురిపై వేటు పడుతుందని తెలిసింది.

కౌలు రైతులకు ఇబ్బందులు..

పత్తి కొనుగోళ్ల కోసం జారీ చేసిన టీఆర్‌లను సాకుగా చూపి అధికారులను సస్పెండ్ చేయడం సరి కాదన్న అభిప్రాయాలను రాష్ట్ర కాటన్ అసోసియేషన్ ప్రతినిధులు వ్యక్తం చేస్తున్నారు. అయితే సీసీఐ కొనుగోలు చేసిన పత్తి డబ్బులు రైతుల ఖాతాల్లోనే పడ్డాయని,వాటిని సొంతానికి వాడుకోవడంతో కొంత మంది కౌలు రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా సీసీఐ 80లక్షల బేళ్ల పత్తి కొనుగోలు జరగ్గా.. ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే 40లక్షల బేళ్లపత్తి సేకరించినట్లు తెలిపా రు. సస్పెన్షన్ విషయమై ప్రభుత్వం పునరాలోచన చేసి నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కేసులు

- ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ



పట్టుకున్న ఇసుక ట్రాక్టర్ల వద్ద పోలీసులు

కమలాపూర్ : ఇసుక అక్రమంగా తరలిస్తే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ హెచ్చరించారు. కరీంనగర్ జిల్లా మానేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను కమలాపూర్ మండలంలోని భీంపల్లి శివారులో ఆదివారం పట్టుకున్నట్లు తెలిపారు. మండలంలోని భీంపల్లిలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మానేరు వాగు నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని, ఆ ట్రాక్టర్లను ఆపే క్రమంలో పోలీస్‌లను గమనించి ఇసుక అక్రమ రవాణాదారులు ట్రాక్టర్లను వదిలి పరారయ్యారని తెలిపారు. ఐదు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించి అక్రమ రవాణాదారులపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతర నిర్వహణకు పటిష్ట బందోబస్తు

- సీఐ ప్రవీణ్‌కుమార్



కోనేరును పరిశీలిస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్

వేలేరు : మండలంలోని మల్లికుదుర్ల శివారులో గల గట్టు మల్లికార్జునస్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే జాతరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ధర్మసాగర్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ముందుగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున తాగునీరు, వైద్య సదుపాయం తదితర ఏర్పాట్లను పరిశీలించారు. జాతరలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, గుట్టపైన ఉన్న కోనేరు వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్సై సురేశ్‌కు సూచించారు. ఆయన వెంట ఈఓ అద్దంకి నాగేశ్వరరావు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

డిస్నీల్యాండ్‌లో ఘనంగా ‘వీడ్కోలు’



వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

దామెర : మండలంలోని ఒగ్లాపూర్ గ్రామంలోని డిస్నీల్యాండ్ ఇ–టెక్నో స్కూల్‌లో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు తెలుపుతూ సమావేశం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తరగతి గదుల్లో చేసిన అల్లరిని, తీపిగుర్తులను నెమరువేసుకున్నారు. అనంతరం పాఠశాల ముఖ్య సలహాదారులు దయ్యాల మల్లయ్య, సదయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నతమైన స్థానంలో స్థిరపడాలని అన్నారు. ఈ పాఠశాల నుంచి ఉన్నత చదువుల కోసం వెళ్తున్న విద్యార్థులు చదువులో రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చుకోవాలని అన్నారు. విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. డైరెక్టర్లు శోభారాణి, రాకేశ్ భాను, దినేశ్‌చందర్, విజయలక్ష్మి, బుద్ధదేవ్‌సూరజ్, హరితరాజు, ఈశ్వర్, కావ్య, మీనా, శ్రీలత, శ్రావణి, మౌనిక పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9553955722
9010299096
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాకేష్ వర్మ (S.R) : 9885438059 (హన్మకొండ)
వి. రాజ్‌కుమార్ యాదవ్ (S.R) : 9966290903 (హన్మకొండ)
ఎం. మధు (S.R) : 8639566261 (పరకాల)
ఎస్. నవీన్ (S.R) : 8919855163 (ఎల్కతుర్తి)